జహీరాబాద్ ఎస్సీ బాలుల హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నేత నామరవికిరణ్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, జనవరి 1: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆకాంక్షించారు. 'యువత దావత్‌లు మానండి.. దాతలుగా మారండి.. హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న పేద విద్యార్థులకు సహాయం చేయాలి' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు మేరకు మంగళవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. నామ సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్టు, బీఆర్ఎస్ నేత నామ రవికిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిలి మిఠాయిలు అందజేశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకుబ్, మొహిజొద్దీన్, జోద్దీన్, రాజ, రమేశ్, పులేందర్, నరేశ్ రెడ్డి, వార్డెన్ కృష్ణ వంశీ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

పలువురికి తీవ్ర గాయాలు

ఆల్గోల్ బైపాస్‌లో బస్సును లారీ ఢీకొట్టడంతో స్తంభించిన వాహనాలు

జహీరాబాద్, జనవరి 1: జహీరాబాద్ పట్టణ సమీపంలోని అల్గోల్ చౌరస్తాలో లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా నడుపుతూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయని జహీరాబాద్ పట్టణ పోలీసులు, ఆర్టీసీ అధికారులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. జహీరాబాద్ డిపోకు చెందిన బస్సు అల్గోల్ చౌరస్తా మీదుగా బీదర్‌కు వెళ్తున్నది. హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి బస్సు వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. లారీ వేగంగా ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్ మునీరొద్దీన్ ఎగిరి కింద పడ్డాడు. బస్సును లారీ ఢీకొన్నప్పుడు రోడ్డు పక్కన నుంచి బైక్‌పై వెళ్తున్న వారిలో ఇద్దరికి బస్సు తగలడంతో అందులో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో రోడ్డుకు ఇరువైపులా వాహన రాకపోకలు స్తంభించిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే జహీరాబాద్ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీ, బస్సును పక్కకు తప్పించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ పట్టణ పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై నుంచి వెళ్లిన పాట్టు లారీ

అక్కడికక్కడే మృతి

నీరుడి కృష్ణ(ఫైల్)

హత్నూర, జనవరి 1: రోడ్డు పక్కన పడుకున్న వ్యక్తిపైనుంచి లారీ వెళ్లడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన హత్నూర మండలం మల్కాపూర్ శివారులో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధానరహదారిపై చోటుచేసుకుంది. మల్కాపూర్ గ్రామానికి చెందిన నీరుడి కృష్ణ(27) మంగళవారం రాత్రి మల్కాపూర్ శివారులోని హెచ్‌పీ పెట్రోల్‌పంప్ వద్ద రోడ్డు పక్కన పడుకున్నాడు. రాత్రి సమయంలో పాట్టులారీ డ్రైవర్ గమనించకుండా వ్యక్తిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి రాత్రి ఇంటికి రాకపోవడంతో బుధవారం వెతకగా పెట్రోల్ పంప్ వద్ద మృతి చెంది కనిపించాడు. దీంతో సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా మృతుడిపై నుంచి పాట్టు లారీ వెళ్లినట్టు గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

సువర్ణదుర్గ పరిశ్రమ ఎదుట ఆందోళన

మల్కాపూర్ శివారులోని సువర్ణదుర్గ పరిశ్రమకు పాట్టు తీసుకువస్తున్న లారీ కారణంగా వ్యక్తి మృతి చెందాడని గ్రామస్తులు పరిశ్రమ వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. పరిశ్రమకు చెందిన పాట్టులారీలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండటంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

తాపీమేస్త్రీ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు

అధ్యక్షుడు శ్రీనివాసులును సన్మానిస్తున్న మహ్మద్‌హుస్సేన్

గుమ్మడిదల, జనవరి 1: మణికంఠ తాపీమేస్త్రీ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులును తాపీమేస్త్రీ సంఘం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండలంలోని బొంతపల్లిలో మణికంఠ తాపీమేస్త్రీ మండల సంఘాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా గోవిందు, ప్రధాన కార్యదర్శిగా యలమంద, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్ద కోటయ్య, కోశాధికారిగా నారాయణ మేస్త్రీ, ఆర్గనైజర్‌గా లచ్చయ్యతోపాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని వీరన్నగూడెం మాజీ వార్డు సభ్యుడు మహ్మద్‌హుస్సేన్ శాలువాతో సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఎదుగుదలకు పాఠశాల మొదటి మెట్టు

బోరుబావిని తవ్వించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 1: విద్యార్థుల ఎదుగుదలకు మొదటి మెట్టు ప్రాథమిక పాఠశాల అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తాగు నీటి కొరత తీర్చడానికి సొంత నిధులతో బోరుబావి తవ్వించి బోరుమోటరు ఏర్పాటు చేశారు. పుష్కలంగా నీరు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో సొంత ఖర్చులతో బోరుబావిని తవ్వించినట్లు తెలిపారు. మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, రైతు నాయకులు మంద బలరాంరెడ్డి, మల్లారెడ్డి, దేవేందర్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు బీఆర్ఎస్ నేతల ఘన స్వాగతం

పటాన్‌చెరు, జనవరి 1: సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జహీరాబాద్‌లో పర్యటనకు వెళ్తున్న సందర్భంలో ముత్తంగి ఔటర్ రింగురోడ్డుపై బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బుధవారం హైదరాబాద్ నుంచి జహీరాబాద్‌కు వెళ్తున్న హరీశ్‌రావును పటాన్‌చెరు నియోజకవర్గ ముఖ్య నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావును సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు, నాయకులకు హరీశ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలతో ప్రజలు విసుగుచెంది బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని, త్వరలో బీఆర్ఎస్‌కు మహర్దశ వస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ఏ కష్టం వచ్చినా పార్టీ అధినేత కేసీఆర్ అండగా నిలుస్తారని భరోసా కల్పించారు. పటాన్‌చెరు కార్యకర్తలకు, నాయకులకు ఏ సమస్య వచ్చిన అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశంగౌడ్, కొలన్‌బాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, యూనుస్, మెరాజ్‌ఖాన్, రామకృష్ణ ముదిరాజ్, రవి పాల్గొన్నారు.

పటాన్‌చెరు: హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

హరీశ్‌రావుకు సన్మానం

బొల్లారం, జనవరి 1: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు జిన్నారం మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలను బాల్ రెడ్డి, రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్ పార్టీ శ్రేణులతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హరీశ్‌రావును ముత్తంగి వద్ద కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీ రత్నం, పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నరేందర్, నరసింహారెడ్డి, శాంతవర్మారెడ్డి, మంద రమేశ్, కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.



హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు ఆదర్శ్‌రెడ్డి, సోమిరెడ్డి తదితరులు



బొల్లారం: మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, యువజన నాయకుడు వెంకటేశం గౌడ్, తదితరులు

ఎమ్మెల్యేలకు నేతల శుభాకాంక్షలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు జిల్లా నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ మైనార్టీ నేత మోయిద్‌ఖాన్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. జిన్నారం మాజీ జడ్పీటీసీ, సీనియర్ నాయకుడు కొలను బాల్‌రెడ్డి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 1

నారాయణఖేడ్: మాజీ మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నేత మోయిద్‌ఖాన్

కోహీర్: హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకుడు

బొల్లారం: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాల క్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

బొల్లారం, జనవరి 1: బొల్లారం మున్సిపల్ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి 6 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆరో తరగతిలో కొత్తగా ప్రవేశాలు కల్పించడంతోపాటు 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీ సీట్ల కోసం ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. http://telanganams.cgg.gov వెబ్‌సైట్‌లో జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు అప్లై చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశాలు పొందో ఓసీ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రాత పరీక్ష 13 ఏప్రిల్ 2025న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనాథాశ్రమాలకు సరుకులు పంపిణీ

నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

పటాన్‌చెరు, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనాథాశ్రమాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బుధవారం పటాన్‌చెరు మండలం రామేశ్వరబండ గ్రామంలోని వీకర్‌సెక్షన్ కాలనీలోని మదర్ మేరీ అనాథ వృద్ధుల సేవా ఆశ్రమం, బొల్లారంలోని డిజైర్ సొసైటీలో ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు భాస్కర్ బృందం వృద్ధులకు, చిన్నారులకు కావాల్సిన నిత్యావసర వస్తువులు అందజేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా వృద్ధుల్లో, డిజైర్ సొసైటీ సంరక్షిస్తున్న చిన్నారులకు అండగా ఉండేందుకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సేవాదృక్పథంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మూర్తి, భాస్కర్, వాసుదేవరావు, శ్రీహరి, యోగానంద్, శ్రీనివాస్ రావు, మోహన్, సురేశ్, ఉదయ్‌కుమార్, దేవేందర్, కృష్ణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణఖేడ్, జనవరి 1: మండలంలోని ర్యాకల్, అబ్బెంద, చాప్టా(కె), సిర్గాపూర్ మండలం వాసర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఈనెల గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ నాగిరెడ్డి తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ తీగల గుండా పెరిగిన చెట్ల కొమ్మలను తొలిగించే పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

రామచంద్రాపురం, జనవరి 1: భారతీనగర్ డివిజన్‌లోని మ్యాక్‌సొసైటీలోని కనకదుర్గ, ఆంజనేయస్వామి ఆలయం ఆవరణంలో బుధవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా జరిగింది. గురుస్వామి రామకృష్ణ ఆధ్వర్యంలో గురుస్వామి ఉమా మహేశ్వరశాస్త్రి నేతృత్వంలో జరిగిన మహా పడిపూజలో గురుస్వాములు, అయ్యప్ప మాల ధరణ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్పొరేటర్ పుష్పానగేశ్, బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

స్వామివారిని దర్శించుకున్న కార్పొరేటర్ పుష్పానగేశ్, బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

బ్రేక్ పడిన రోడ్డు పనులు ప్రారంభం

నారాయణఖేడ్, జనవరి 1: గత డిసెంబర్ 20వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో 'రోడ్డు పనులకు బ్రేక్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులను ప్రారంభించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.15 కోట్లతో ఏర్పాటు చేయనున్న నారాయణఖేడ్-మాసాన్‌పల్లి డబుల్ లేన్ రోడ్డు పనులు ప్రారంభించగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పనులు చేపట్టక పోవడంపై 'నమస్తే తెలంగాణ' సవివరమైన కథనాన్ని ప్రచురించింది. దీంతో అధికారులు ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందోల్: అందోల్- జోగిపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అర్ధరాత్రి వరకూ వాహనాల తనిఖీలు

నారాయణఖేడ్/అందోల్, జనవరి 1: నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాల్లో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి వారకు వాహన తనిఖీలు చేపట్టారు. నారాయణఖేడ్ పట్టణంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసులు నమోదు చేయడంతోపాటు సరైన వాహన పత్రాలు లేని 30 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నారాయణఖేడ్: రాజీవ్‌చౌక్ వద్ద తనిఖీలు చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ, ఎస్ఐ

ఆర్టీసీ అభివృద్ధికి కలిసి పని చేయాలి

జహీరాబాద్, జనవరి 1: ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం స్థానిక డిపోలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు సమన్వయంతో పని చేస్తూ ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అందోల్, జనవరి 1: ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు గాయపడినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. మండల పరిధిలోని అల్మాయిపేట్ గ్రామానికి చెందిన పాషా(25) వాజీద్ బుధవారం రాత్రి జోగిపేట నుంచి స్వగ్రామం అల్మాయిపేట్‌కు వెళ్తుండగా జోగిపేట పైర్ స్టేషన్ వద్ద వారు నడుపుతున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. షాషా ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. వాజీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బొల్లారంలో నకిలీ మందుల పట్టివేత

బొల్లారం, జనవరి 1: నకిలీ, కాలం చెల్లిన మందులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. మనుషుల ప్రాణాలకు ముప్పుతెచ్చే ఈ మందులను డ్రగ్ కంట్రోల్ అధికారులు పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామిక వాడలోని ఆక్రాన్ పరిశ్రమలో నార్కోటిక్ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రముఖ పరిశ్రమల పేరిట నకిలీ మందులు తయారు చేస్తున్నట్లు నార్కోటిక్ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. తనిఖీల్లో ఏకంగా రూ.2 కోట్ల విలువైన మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మోంటెక్ ఎల్సీ టాబ్లెట్లతోపాటు పలు మందులను సీజ్ చేశారు. పరిశ్రమలో జరుగుతున్న చట్టవ్యతిరేక వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు.

సిద్ధివినాయకుడికి భక్తుల నీరాజనం

పూజలు చేస్తున్న కంచికమ కోటి పీఠం ఆలయ ధర్మధికారి జయశంకర్‌బాలగోపాల్ దంపతులు, హాజరైన భక్తులు

జహీరాబాద్, జనవరి 1: విఘ్నాలను తొలిగించే న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయం భక్త'జన' సంద్రమైంది. వేదపండితుల మంత్రోచ్చారణలు.. భోలో సిద్ధివినాయక మహారాజ్‌కీ జై అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. నూతర సంవత్సరంతో పాటు స్వామివారి జయంతోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్యర్యంలో ఉదయం ఆలయంలో వేదపండితులు స్వామివారికి అభిషేకం, గణపతి హవనం, శతచండీహవనం, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. యాగశాలలో కమిటీ సభ్యులతో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య యాగశాలలో అగ్నిమతాన్ని చేపట్టి యజ్ఞములను వైభవంగా ప్రారంభించారు. అయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సందడితో పాటు వేదపండితుల మంత్రోచ్చారణలో ఆలయం మార్మోగింది. తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కంచికమకోటి పీఠం ఆధ్వర్యంలో ఆలయ ట్రస్టు సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ, హద్నూర్ పోలీసుల ఆధ్యర్యంలోభక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ కమిటీ, పలువురు దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి జయశంకర్‌బాలగోపాల్, గౌరవ అధ్యక్షుడు అల్లాడి వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ రేజింతల్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సిహులు, ఉపాధ్యక్షులు నీల రాజేశ్వర్, ఉల్లిగడ్డ బస్వరాజ్, సంయుక్త కార్యదర్శులు చిద్రి లక్ష్మణ్, కల్లచంద్రశేఖర్, కోశాధికారి డిగంబర్ పోలా, కార్యనిర్వహకులు కోబ్బజీ రవికుమార్, సుధాకర్‌పాటిల్, సభ్యులు సంగమేశ్వర్, ప్రవీణ్‌కుమార్ దీక్షిత్, దీపక్‌జ్యోషి, చంద్రశేఖర్, మేనేజర్ కృష్ణ, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

It is hereby informed to the General public that my Client Sri. N. Soundar Rajan S/o. Muthu Swamy entered into an Agreement of sale in respect House site open Plot bearing No.135 on a land admeasuring 150 Sq.Yards equivalent to 125.4 Square meters, in survey Nos. 220 and 222, situated at Indresham Village, Patancheru Mandal, Sangareddy District, Telangana State with Smt. Kothwalagudem Bhagyamma W/o. Late Balaiah, and paid substantial amount as advance sale consideration, if any person or persons having any claim, interest or any right in respect of above said property are hereby requested to make known to the same in writing to the under singed with documentary evidence in support thereof with in 10 days from the date of publication hereof, failing which such claims/or objections, if any, shall be considered as waived and or discharged forever.

SCHEDULE OF PROPERTY

All that House site open Plot bearing No.135 on a land admeasuring 150 Sq.yards equivalent to 125.4 Square meters, in survey Nos.220 and 222 situated at Indresham Village, Patancheru Mandal, Sangareddy District, Telangana State and bounded by: North: Plot No. 136, South: 30' wide Road, East: Plot No.116, West: Plot No.135/A.

M/s. J. Rama Krishna, A. Hussain,
Advocates
H.No.48-19, Rami Reddy Nagar
Quthbullapur, Municipal Circle
and Mandal, GHMC,
Medchal-Malkajgiri District
Ph: 9440168144, 8519868154